క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి



లంకాయపల్లిలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

తుగ్గలి: వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సచివాలయ కన్వీనర్ హనుమంత రెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం ' నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నంపల్లి సుంకన్న, నజీర్ ఉన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ఆస్పరి: ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పవచ్చని తహసీల్దార్ కుమారస్వామి కోరారు. ఆయన బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 65 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఓటర్లు 50,449 మంది ఉన్నారన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో గ్రామాల్లోని బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటరు జాబితాపై ప్రచారం చేస్తారన్నారు. ఎవరైన మరణించినా, ఓటరు జాబితాలో తపొప్పులున్నా దరఖాస్తులు ఇవ్వవచ్చన్నారు. గ్రామాలలో బూత్ లెవల్ ఆఫీసర్లుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయాలన్నారు.

వసతి గృహాన్ని పున:ప్రారంభించాలి

గోనెగండ్ల: మండల కేంద్రంలో మూసివేసిన బాలుర వసతి గృహాన్ని పున:ప్రారంభించాలని పీడీఎస్‌ఓ తాలూకా కన్వీనర్ సురేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్లలో పేద విద్యార్థుల విద్యాభ్యున్నతి కొరకు రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు నష్టం కలిగించే విధంగా విలీనం పేరుతో గోనెగండ్లలోని బాలుర వసతి గృహాన్ని మూసివేసిందని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం బాలుర వసతి గృహాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మనోహర్, అధ్యక్ష కార్యదర్శులుగా పవన్, ఉదయ్‌లతో పాటు మరి కొంతమందిని ఎన్నుకున్నారు. ఆ సంఘం నాయకులు సురంజినేయులు, కిట్టు, రాము పాల్గొన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): హైవే- 44పై వెల్దుర్తి మండల పరిధిలోని మదార్‌పురం వద్ద గుర్తు తెలియని



మృతి చెందిన జింక

వాహనం ఢీకొని జింక మృతి చెందింది. బుధవారం రోడ్డు పక్కన పొలాల్లో జింక కళేబరాన్ని గుర్తించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కాళిదాసు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రోడ్డు దాటే సమయంలో జింకను వాహనం ఢీకొనగా అతికష్టం మీద కొద్ది దూరం పొలాల్లోకి వెళ్లి మృత్యువాత పడినట్లు ప్రాథమిక విచారణలో తెలుస్తోందని ఎఫ్‌బీఓ చెప్పారు. జింక కళేబరానికి పుల్లగుమ్మి పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి పోస్టుమార్టం నిర్వహించగా, అనంతరం దహనం చేశారు.

మాజీ ఎంపీటీసీ మృతి

కృష్ణగిరి: లక్కసాగరం మాజీ ఎంపీటీసీ మాదిగ రంగమ్మ (60) అనారోగ్యంతో బుధవారం మరణించింది. గ్రామ పెద్దలు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి తదితరులు మృతురాలికి నివాళులర్పించారు.



మాదిగ రంగమ్మ (ఫైల్)

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

మద్దికెర: ఈనెల నుంచి ఆన్‌లైన్ విధానంలో లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ నాగభూషణం బుధవారం తెలిపారు. గత నెలలో కొంత మందికి సాఫ్ట్‌వేర్ ఇబ్బందుల వల్ల ఆఫ్‌లైన్ విధానంలో చౌక దుకాణాలలో నిత్యావసర వస్తువులు అందించడం జరిగిందన్నారు. ఈవిషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సరిచేసినట్లు చెప్పారు. ఇక నుంచి ప్రభుత్వం సబ్సిడీతో అందించే సరుకులను ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వచ్చి అందిస్తారని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో మద్యం ప్యాకెట్లను విక్రయిస్తున్న నీలకంఠ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. సదరు వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొచ్చి గ్రామంలో విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి 90 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.



ఈ ఫొటోలో ఉన్న దివ్యాంగ బాలుడి పేరు గోట్ల సాయినాథ్.. వెల్దుర్తి మండల కేంద్రం 2వ వార్డులోని చేనేత కార్మికులు గోట్ల రేఖ, రవీంద్రల ముద్దుల కుమారుడు. 12 ఏళ్ల సాయినాథ్ పుట్టుకతో మానసిక, శారీరక దివ్యాంగుడు. కదలలేని స్థితిలో ఉన్న ఇతనికి 80 శాతం వికలత్వం ఉన్నా గతంలో వికలాంగుల పింఛన్ రూ.3 వేలు మాత్రమే అందుతుండేది. ఈ విషయాన్ని స్థానిక సచివాలయం-2 వలంటీర్ కె.కాంతారెడ్డి వెల్ఫేర్ అసిస్టెంట్ అయ్యస్వామి దృష్టికి తీసుకెళ్లాడు. ఆపై స్వయంగా దివ్యాంగ బాలుడు, కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు వైద్యాధికారుల వద్దకు వెళ్లి అనారోగ్య పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. ఈ ఏడాది జనవరి నుంచి అతనికి రూ.5 వేల పింఛన్ అందేలా కృషి చేశాడు. ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన మంజూరు చేసిన పింఛన్ సొమ్మును ఠంఛనుగా ఆ ఇంటికి వెళ్లి అందిస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో తక్కువ పింఛన్‌తోపాటు, అతి కష్టం మీద పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి సొమ్ము తీసుకోవాల్సి వచ్చేదని, వలంటీర్ వ్యవస్థ వచ్చిన నాటి నుంచి తమ ఇంటి వద్దకే పింఛన్ అందడంతోపాటు, సొమ్ము కూడా పెంచారని లబ్ధిదారుడి తల్లి గోట్ల రేఖ ప్రభుత్వానికి, వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. – వెల్దుర్తి (కృష్ణగిరి)

ఠంచనుగా పింఛన్

హొళగుంద: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో వలంటీర్లు బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్దకే వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 6,118 మంది పింఛనుదారులుండగా బుధవారం తొలిరోజు 2,087 మందికి పింఛన్లను పంపిణీ చేసి 34 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ తెలిపారు. గత పాలనలో పీడకల లాంటి పింఛన్ పంపిణీ ప్రక్రియకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్వస్తి పలకడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ సొమ్ము అందుతోంది.

70 శాతం పింఛన్ల పంపిణీ

గోనెగండ్ల: గోనెగండ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు బుధవారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపుతట్టి పింఛను డబ్బును అందజేశారు. మొదటి రోజు మండలంలో 70 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తామన్నారు.



హొళగుందలో లబ్ధిదారు మల్లమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ విజయలక్ష్మి

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం గోనెగండ్ల 2వ వార్డులో, అలాగే సాయంత్రం ఒంటెడుదిన్నె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. అలాగే ప్రతి కుటుంబానికి ఏయే పథకాల కింద ఎంతెంత లబ్ధి పొందారనే విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు టీడీపీ నాయకులు చెప్పే మాటలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల సారథి అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే అందించాలన్న సంకల్పంతో అనునిత్యం కృషి చేస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కన్వీనర్ దొరబాబు, ఎంపీటీసీ రఫీక్, ఒంటెడుదిన్నె సర్పంచ్ కేశవ రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

సురక్ష వైద్య శిబిరానికి స్పందన

దేవనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరీదేవి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నేలతలమరి గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని' ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దాదాపు 300 మందికి పైగా రోగులు వైద్య చికిత్సలు చేయించుకున్నట్లు వైద్యులు కళ్యాణ్, అరుణ్‌జ్యోతి, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గురించి ఆరా తీసి, వారికి కర్నూలు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రాజారెడ్డి, సహదేవ్, జయరాం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరీదేవి

నోటి శుభ్రత పాటించాలి

మద్దికెర: ప్రతి ఒక్కరూ నోటి శుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక కాలనీలో నోటి శుభ్రత అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీతల పానీయాలు, తీపి పదార్థాలను వీలైనంత తక్కువగా తీసుకోవాలన్నారు. తిన్న వెంటనే నోటిని నీటితో పుక్కిలించాలన్నారు. రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

ఆస్పరి: ఆస్పరికి చెందిన కుంభాల రంగస్వామి అక్టోబర్ 28న గుండె పోటుతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైనట్లు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. బుధవారం మృతుడి భార్య ఉరుకుందమ్మకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదును అందజేశారు. మిగతా సొమ్మును త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమఅవుతుందని వెల్లడించారు. కేడీసీసీ జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నేడు భజన పోటీలు

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెల పూజ సందర్భంగా భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వారు బుధవారం మాట్లాడుతూ.. గురువారం రాత్రి 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొనే బృందాలు అదే రోజు రాత్రి 8 గంటలలోపు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు 30 తులాల వెండి, తరువాతి స్థానాలకు వరుసగా 20, 15, 12, 10, 8, 5.5, 5, 2.5, 2 తులాల వెండి బహుమతులను ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 95536 36720, 98856 37504 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు కృష్ణగిరి మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ.. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

రేపు మద్దికెర మండల సర్వసభ్య సమావేశం

మద్దికెర: ఈ నెల 3వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి బుధవారం తెలిపారు. మండలంలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనుల గురించి సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులా పరమేశ్వరీ దేవాలయంలో గురువారం పోతురాజు, సింహవాహనం సహిత శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి, సుంకులా పరమేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం గణపతి పూజలు, దీక్షా హోమం, జలధివాసం, మహా మంగళహారతి, శుక్రవారం ధాన్యధివాసం, మంత్ర పుష్పం, సాయంత్రం విగ్రహాల గ్రామోత్సవం ఉంటుందని, 4వ తేదీ విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు, పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.



బురుజుల గ్రామంలో నిర్మించిన సుంకులా పరమేశ్వరి ఆలయం

11న మాదిగల విశ్వరూప మహాసభ

వెల్దుర్తి (కృష్ణగిరి): ఈనెల 11న తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి), ఎంఎస్‌పీ (మహాజన సోషలిస్టు పార్టీ) ఆధ్వర్యంలో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు కార్యక్రమ ప్రజా సమీకరణ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథం తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో కర్నూలు జిల్లా నాయకుడు రెడ్డిపోగు భాస్కర్, స్థానిక మండల సమితి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ వైకే విశ్వనాథం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టి అనంతరం మహాసభ నిర్వహించనున్నారన్నారు. ఈ మహాసభకు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవనున్నట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల మాదిగలు విరివిగా తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నాయకంటి గిడ్డయ్య, జిల్లా, మండల, గ్రామాల ప్రతినిధులు ఎర్రబజారు, జె.బజారు, ప్రకాశ్, రత్నమయ్య, దేవదానం, మోషే, సూర్యచంద్ర పాల్గొన్నారు.



వెల్దుర్తిలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

శరవేగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం

చిప్పగిరి: జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.54 లక్షలతో చిప్పగిరిలో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్థానిక ఎంఈఓ కార్యాలయం సమీపంలో పాత నీటి ట్యాంకు ఉన్నప్పటికీ గ్రామంలో పలు కాలనీలకు తగనంతగా నీరు సరఫరా అయ్యేది కాదు. దీంతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు తెలిపారు. ట్యాంకు నిర్మాణం పూర్తయితే గ్రామంలోని హరిజన కాలనీ, సుంకులమ్మ కాలనీ, గోవిందప్ప స్వామి కాలనీతో పాటు అనేక కాలనీలకు నీటి సమస్య తీరనుంది. ట్యాంకు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చిప్పగిరిలో నూతనంగా నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



గుడిసె నుంచి వెలువడుతున్న పొగ



మంటల్లో కాలిపోయిన నగదు, బంగారు ఆభరణాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వెంకటాపురం కాలనీలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం అయింది. కాలనీకి చెందిన చిన్న ఈరన్న తన గుడిసెలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బంధువుల శుభకార్యం ఉండడంతో గుడిసెకు తాళం వేసి వెళ్లారు.ఈ స్థితిలో గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో మంటలు చెలరేగాయి. కాలనీవాసులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈలోపు గుడిసెలోని ధాన్యం, నగదు, బంగారు ఆభరణాలు కాలి బూడిదయ్యాయి. కాలనీ వాసులు అగ్ని ప్రమాద విషయాన్ని కోసిగికి వెళ్లిన చిన్న ఈరన్నకు తెలిపారు. ప్రమాద నష్టం రూ. 5 లక్షలు పైగా ఉంటుందని అగ్నిమాపక అధికారి ఆంజనేయులు తెలిపారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం



తొగర్చేడులో నిర్మాణం పూర్తయిన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతులమీదుగా ఈ భవనాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

మిర్చి రైతులకు అవగాహన

దేవనకొండ: మండలంలోని కుంకనూరు, అలారుదిన్నె గ్రామాల్లో మిరప పంటలను సాగుచేసిన రైతులకు పంటల సస్యరక్షణ చర్యలు, మెలకువలపై బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో ఏఓ సురేష్‌బాబు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంటకు సోకే తెగుళ్లు, పురుగుల నివారణపై సూచనలు చేశారు. మిరప పైర్లలో తామర పురుగులు, తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందని వీటి నివారణకు ఐపీయంలో భాగంగా ఎకరాకు 40 పసుపు రంగు అట్టలు, 30 నీలిరంగు అట్టలు, 30 తెలుపురంగు జిగురు అట్టలను పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవ సంబంధమైన నీళ్ల మందులను బవేరియా, వట్టిసీలియం, సూడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి తయారు చేసుకొని వాడే పద్ధతుల గురించి వివరించారు. తెల్లదోమ నివారణకుగానూ ఏస్ట్యామిప్రైడ్ 2 గ్రాములు, డిఫెత్రూన్ 1.5 గ్రాములు పూతలో మొగ్గ పురుగు నివారణకు కార్బొసల్ఫాన్ 1.5 ఎంఎల్ మలాతియన్ 2 ఎంఎల్ లీటర్ నీటికి వేపనూనె 3 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. అనంతరం మిరప పొలాలను పరిశీలించి రైతులకు పలు సలహాలు ఇచ్చారు. ఉద్యాన శాఖ అధికారి దస్తగిరి, ఏఈఓ జయరాం, హెచ్‌ఈఓ నాగసునీల్‌కుమార్, వీహెచ్‌ఏ మునిస్వామి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సురేష్‌బాబు

ఎన్‌ఏఎస్ టెస్ట్‌పై అవగాహన

చిప్పగిరి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించే నేషనల్ ఆసెస్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్షపై మండలంలోని హెచ్‌ఎంలకు ఎంఈఓ బాలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 3న పరీక్ష ఉంటుందని 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్, 6వ తరగతి వారికి 5వ తరగతి, 9వ తరగతి వారికి 8వ తరగతి సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామానికి చెందిన నర్సామల ఓంకార్, సోమలింగమ్మల కుమార్తె మాధవి (14) బుధవారం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలిక గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లిన మాధవి అక్కడే పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో పడిఉన్న బాలికను కుటుంబ సభ్యులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి (కృష్ణగిరి): లక్ష్మీ నగరం తండా గ్రామంలో బుధవారం 80 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, సారా అమ్ముతున్న ఎల్ తండాకు చెందిన లక్ష్మీబాయి, బోయనపల్లెకు చెందిన సాలమ్మను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



సత్తాచాటిన క్రీడాకారులతో డీఈఓ రంగారెడ్డి, పీడీలు

ఎమ్మిగనూరుటౌన్: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని కొండగుంటూరు హైస్కూల్‌లో గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. 14 సంవత్సరాల్లోపు విభాగంలో దక్షిత, సాయి, శ్రీవల్లి నాల్గవ స్థానంలో నిలవగా ధరణి, శీతాక్షి, దీపిక, విజయలక్ష్మి 5వ స్థానం కైవసం చేసుకొన్నారు. అదే విధంగా 17 సంవత్సరాల్లోపు విభాగంలో మౌనిక, నిత్యసాయి నాల్గవ స్థానంలోనూ, హారిక, అమూల్య గోల్డి ఐదో స్థానంలో నిలిచారు. ప్రతిభ చాటిన క్రీడాకారిణులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు నాగేశ్వరి, సుజనకుమారిలను డీఈఓ రంగారెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించండి

నందవరం: గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ అల్లిపీర ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథరామయ్య అధ్వర్యంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో వలసలు నివారించేలా తక్షణమే వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త ప్రణాళికను తయారు చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరును ఎన్‌ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. పల్లెల్లో వలసలు నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చేనేత సొసైటీ వైస్ చైర్మన్ మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టంలోని ది ఎమ్మిగనూరు వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్ కటికె అబ్దుల్‌సాబ్ (85) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సొసైటీ చైర్మన్ మాచాని రఘునాథ్ ప్యానెల్లో ఆయన వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. మూడు సార్లు డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయన మృతికి వీవర్స్ సొసైటీ చైర్మన్ మాచాని రఘునాథ్, డైరెక్టర్లు శ్రద్ధాంజలి ఘటించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

హొళగుంద: ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉన్న ఊరిలోనే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ భక్తవత్సలం సూచించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు ఏర్పడి వ్యవసాయ పనులు తగ్గాయని, కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికడదాం

నందవరం: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఎంపీడీఓ దశరథరామయ్య, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి మండల అధికారులు, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. జెడ్పీ పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు ర్యాలీ చేపట్టి మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు దాటిన తరువాతే వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పాఠశాలల చుట్టు పక్కల సిగరెట్, బీడీ షాపులు తొలగించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. డీటీ రఘువీర, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



నందవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సర్పంచ్, విద్యార్థులు

అక్రమ మద్యం, నాటుసారా ధ్వంసం

కృష్ణగిరి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పలు ఎక్సైజ్ కేసులకు సంబంధించిన అక్రమ మద్యం, నాటుసారాను గురువారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి సమక్షంలో ధ్వంసం చేశారు. వందలాది కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, 5 లీటర్ల నాటుసారాను కృష్ణగిరి శివారులో రెవెన్యూ సిబ్బంది పంచనామా అనంతరం యంత్రాల సాయంతో ధ్వంసం చేశామని ఎస్ఐ సురేశ్ తెలిపారు. అనంతరం డీఎస్పీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు.



మద్యం టెట్రా ప్యాకెట్లను ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన దృశ్యం

పులికొండలో వైద్య శిబిరం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో బుధవారం వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలో రెండు రోజుల కిందట జ్వరంతో కోలుకోలేక వర్షిణి (7) మృతి చెందింది. ఆ బాలిక డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లుగా ప్రచారం జరగడంతో బుధవారం జిల్లా మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాలిక డెంగీతో మృతి చెందలేదని నిర్ధారించుకున్నారు. డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సెక్రటరీ మునిస్వామి పాల్గొన్నారు.